క్లుప్తంగా

రేపు మండల పరిషత్ సమావేశం

నూజివీడు: నూజివీడు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం శుక్రవారం జరుగుతుందని ఎంపీడీఓ కె. కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ ఆరేపల్లి శిరీష అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో ఎంపీటీసీలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, జెడ్పీ వైస్ చైర్మన్, గౌరవ సభ్యులు పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు



మైలవరం: కంటి చూపు లేనిదే మనం దేనిని గుర్తించలేమని, అంధకారంలో ఉంటామని హైదరాబాద్ డాక్టర్ ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వీసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ జె. రమేష్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మైలవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. అనంతరం డాక్టర్ రమేష్ కంటి ఆవశ్యకతను వివరించి, దృష్టి లోపం ఎలా వస్తుంది, అది రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తినాలన్నారు. విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో బుధవారం విద్యార్థులకు దేశభక్తి గీతాలాపన, పుస్తక సమీక్ష, కథల పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులు నేర్చుకున్న అంశాలపై పోటీలు జరిగాయి. పోటీలను గణపతి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో అసాధారణ నైపుణ్యం దాగి ఉంటుందని, అది వెలికి తీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రంథాలయ అధికారి కె.రమాదేవి మాట్లాడుతూ గురువారం క్యారమ్ బోర్డ్, చదరంగం పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలి పిలుపునిచ్చారు. విజేతలకు ఈనెల 7న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన మజ్జిగ పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): మండే వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకే ప్రతి ఏటా ఎక్స్‌రే, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేస్తున్నామని ఎక్స్ రే గ్రూప్ సంస్థల ప్రధాన బాధ్యులు కొల్లూరి అన్నారు. సాంబమూర్తి రోడ్డులో బుధవారం 65 రోజులుగా నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము ఏటా వేసవిలో ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, ఎక్స్ రే వాకర్స్ క్లబ్, అంజలి, గీతాంజలి, దుర్గాతేజ లయన్స్ క్లబ్‌ల సంయుక్త నిర్వహణలో మజ్జిగ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. తాము చేస్తున్న సేవలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి జూన్ 5 వరకు 65 రోజులుగా దాదాపు 15,000 మందికి ఉచిత మజ్జిగ పంపిణీ చేశామని చెప్పారు. ఎక్స్ రే ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తోటివారికి సహాయపడే మనస్తత్వం అలవర్చుకోవాలని కోరారు. వేసవి మండే ఎండలలో వడగాల్పులను సైతం లెక్కచేయక అకుంఠిత దీక్షతో మజ్జిగ పంపిణీ నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.

నీట్‌లో విద్యార్థుల ప్రతిభ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నీట్–2024 ఫలితాల్లో 720 మార్కులకు గాను దేవిరెడ్డి హేమహరిణి–676, రవళిక మచ్చ–676, భార్గవ్ నూతక్కి–673 మార్కులు సాధించారని శ్రీ భవిష్య అకాడమీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 667, 664, 662 వంటి అత్యధిక మార్కులతో పాటు 600 మార్కులకు పైగా 60 మంది, 550కి పైగా 173 మంది, 500కి పైగా 243 మంది, 480కి పైగా 301 మంది, 450కి పైగా 386 మంది తమ విద్యార్థులు మార్కులు సాధించారన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో ఈ ఫలితాలు సాధించగలిగామని చెప్పారు. నీట్–2024 ఫలితాలలో శ్రీ భవిష్య విద్యార్థులు 350లకు పైగా ఎంబీబీఎస్ ఫ్రీ సీట్లను సాధించే అవకాశం ఉందన్నారు. అత్యుత్తమ ఫలితాలను సాధించినందుకు విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు అధ్యాపకులను కళాశాల డైరెక్టర్లు అభినందించారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం
- మొక్కలు నాటిన విద్యార్థులు
- పలుచోట్ల ర్యాలీలు





నూజివీడులో మొక్క నాటుతున్న బ్రదర్ చిన్నప్పరెడ్డి, ఎన్‌సీసీ క్యాడెట్లు : ఇబ్రహీంపట్నం ఏపీ జెన్‌కో శిక్షణ కేంద్రంలో మొక్కకు నీళ్లు పోస్తున్న నవీన్ గౌతమ్

నూజివీడు/తిరువూరు/మైలవరం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో పలుచోట్ల బుధవారం ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను పలువురు వివరించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నూజివీడులోని 8వ ఆంధ్రా ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ వింగ్ కమాండర్ అజిత్‌సింగ్‌రాతీ ఆదేశానుసారం సెయింట్ థామస్ స్కూల్ ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ప్రిన్సిపాల్ చిన్నప్పరెడ్డి ఎన్‌సీసీ క్యాడెట్లతో కలిసి స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. చిన్నప్పరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. విచ్చలవిడిగా చెట్లను నరికివేయడం వల్ల వాతావరణంలో కార్బన్‌డైఆక్సైడ్ శాతం పెరిగిపోయి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, దీనివల్ల రానున్న రోజుల్లో ప్రజలు అనేక అనర్థాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ గమనించి మొక్కలు నాటడం ద్వారా వాతావరణంలో ఆక్సిజన్ స్థాయి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ హబ్ కో–ఆర్డినేటర్ బ్రదర్ రోనాల్డ్, బ్రదర్ మారయా, ఎన్‌సీసీ కేర్ టేకర్ కేవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై అవగాహన

ఇబ్రహీంపట్నం: మొక్కల సంరక్షణ ద్వారా పర్యావరణను పరిరక్షించవచ్చని ఏపీ జెన్‌కో ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జి చీఫ్ ఇంజినీర్ పి.నవీన్‌గౌతమ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సంస్థ పరిసరాల్లో మంగళవారం వివిధ రకాల మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఎస్ఈ సుశీల, జీఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కొండపల్లి ముత్యాలమ్మ చెరువు ప్రాంతంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రమాదేవి మొక్కల పెంపకం, కిచెన్‌గార్డెన్, ఇంకుడు గుంతలు తీయడంపై అంగన్‌వాడీలకు అవగాహన కల్పించారు. స్థానికుల ఇళ్లల్లో మునగజాతి మొక్కలు నాటించారు. కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం జరిగింది. బాలికలతో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచాలి..

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని ఏపీఎం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కమలాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి వాటిని సంరక్షించాలని సూచించారు. పర్యావరణాన్ని రక్షించుకోవడం చెట్ల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఆగిరిపల్లి: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సీడీపీఓ నూరాని అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగిరిపల్లి, వడ్లమాను, చిన్నాగిరిపల్లి, నూగొండపల్లి, సింగన్నగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటారు. ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారు. అనంతరం ఆగిరిపల్లి కొండ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య ఆరంభ దశ విద్యా దినోత్సవం సందర్భంగా విద్యా ప్రాముఖ్యతపై విద్యార్థుల తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీ ఓ. నాగేశ్వరి, సూపర్‌వైజర్ రాగమయి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి..

మైలవరం: పర్యావరణాన్ని పరిరక్షించుకుని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రధానోపాధ్యాయుడు పి. గోపాల్ అన్నారు. మైలవరం ఆరో వార్డులోని ప్రాథమిక పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం బుధవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని, ప్లాస్టిక్‌ను వాడొద్దని, జ్యూట్ బ్యాగ్‌లను మాత్రమే వాడాలన్నారు. మంచి నీటిని వృథా చేయవద్దని సూచించారు. మట్టి కుండలు వాడటం వలన ఆరోగ్య సమస్యలు రావన్నారు. విద్యార్థులు తమ పుట్టిన రోజున మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



కొండపల్లిలో గర్భిణుల ఇళ్లల్లో మునగ మొక్కలు నాటిస్తున్న రమాదేవి



కొత్తూరు తాడేపల్లిలో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు



ఆగిరిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటుతున్న సీడీపీఓ నూరాని

పోరాటాలు నాకు అలవాటే

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు



స్వామిదాసు

తిరువూరు: ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, పరాజయాలకు తాను కుంగిపోనని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. బుధవారం తిరువూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు తమను నిరాశపరిచాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల కోసం విజయవంతంగా సంక్షేమ పథకాలను అమలు చేసిందని, ఎన్‌డీఏ కూటమి అలవికాని వాగ్దానాలతో ఎన్నికల్లో ఓటర్లను మభ్యపెట్టి అడ్డదారిలో గెలుపొందిందని స్వామిదాసు చెప్పారు. తాత్కాలికంగా మోసంతో జయించవచ్చని, అంతిమ విజయం నిజాయతీదేనన్నారు. తనకు పోరాటాలు కొత్త కాదని, గత 40 ఏళ్లుగా ప్రజా సమస్యల కోసం తాను పోరాడుతున్నానని చెప్పారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని, పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ సంఘీభావం తెలపాలని కోరారు. ఎన్‌డీఏ కూటమి ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి ఇకపై నిరంతరం పోరాడతామని చెప్పారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థిని ఎంపిక



ఆగిరిపల్లి: తోటపల్లిలోని ఫ్రీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న కొంకా హారిక నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ (ఎన్ఎంఎంఎస్) స్కాలర్‌షిప్‌నకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు తాడిశెట్టి శోభన్‌బాబు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌నకు రాత పరీక్ష ద్వారా విద్యార్థిని హారిక ఎంపికైందని చెప్పారు. హారికకు 8వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ప్రతి సంవత్సరం రూ.12,000 స్కాలర్‌షిప్ లభిస్తుందన్నారు. విద్యార్థిని హారికను అభినందించి సత్కరించారు.

వైఎస్సార్ సీపీ మహిళా కార్యకర్తపై దాడి

జూపూడి(ఇబ్రహీంపట్నం): టీడీపీ విజయోత్సవ రాలీలో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ మహిళా కార్యకర్తపై దాడిచేశారు. జూపూడి భీమేశ్వరకాలనీలో సోమవారం రాత్రి జరిగిన దాడిలో చేవూరి కీర్తి నుదిటిపై గాయమైంది. మైలవరం నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ విజయంతో ఆ పార్టీ కార్యకర్తలు పోలీస్ ఆంక్షలు ఉల్లంఘించి బైక్ ర్యాలీ నిర్వహించారు. కాలనీ వీధుల్లో బైకులతో వైఎస్సార్ సీపీ నాయకుల ఇళ్ల ముందు కవ్వింపు చర్యలకు దిగారు. కావాలని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. టీడీపీ చర్యలను కొందరు వీడియో తీశారు. వీడియో తీస్తున్నారనే నెపంతో చేవూరి కీర్తి ఇంట్లోకి చొరబడి ఆమెపై విచక్షణా రహితంగా దాడికి దిగారు. నుదిటిపై గాయమై రక్తస్రావమైంది. ఆమె వైద్యశాలకు వెళ్లి చికిత్స తీసుకుంది. తనపై దాడి చేసిన కలతోటి రాజేష్, అనుచరులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ





కీర్తిని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు. (ఇన్‌సెట్) టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన చేవూరి కీర్తి

విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నేతలు కీర్తిని పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, దుర్గగుడి పాలకవర్గ సభ్యుడు చింకా శ్రీనివాసరావు, కలతోటి కొండలరావు, బాణావత్ బాలాజీ తదితరులు ఆమెను పరామర్శించి ధైర్యం చెప్పారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పాయకాపురం(విజయవాడరూరల్): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని విజయవాడ నగర పాలక సంస్థ జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం 63వ డివిజన్ పాత, కొత్త రాజీవ్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. వాతావరణంలో చోటు చేసుకొన్న మార్పుల కారణంగా ప్రజలు నివసించే పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కోరారు. చెత్తకుప్పలు ఎప్పటికప్పుడు క్లీన్ చేయడం, ఆ ప్రాంతాల్లో సున్నం చల్లించడం చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌ను ఆదేశించారు. ప్రతి రోజూ డ్రెయినేజీల్లో సిల్ట్ లేకుండా చూడాలని, మురుగునీరు కాల్వల్లో నిలబడకుండా చూడాలన్నారు. మురుగుకాల్వలకు సమీపంలో ఉన్న తాగునీటి పైపులైన్లు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చోట్ల మరమ్మతులు చేయించడానికి తగిన చర్యలు చేపడుతున్నట్లు జోనల్ కమిషనర్ పేర్కొన్నారు. తాగునీరు కలుషితం కాకుండా ఉండేందుకు వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించడం, శాంపిల్స్ సేకరించడం జరుగుతుందన్నారు. అవసరమైన ప్రాంతాల్లో వైద్యసిబ్బందితో సర్వే చేయిస్తున్నామని చెప్పారు.



బ్లీచింగ్ చల్లిస్తున్న జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గుంటూరుకు చెందిన మహాదేవ్ కూచిపూడి నాట్యక్షేత్రానికి చెందిన పలువురు చిన్నారులు బుధవారం సాయంత్రం ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచ హారతుల సేవ అనంతరం మామిడాల పావని పర్యవేక్షణలో సోనిక, తన్వీ, జ్యోత్స్నిక, హరిణి, హేమ, వివక్ష, లాస్య, దుర్గా, జయలక్ష్మిల శిష్య బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్య బృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రకృతి వనరులను కాపాడాలి

మైలవరం: ప్రకృతి వనరులను ధ్వంసం చేయవద్దని, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విశ్రాంత ఫారెస్ట్ అధికారి జాకోబ్ బెనర్జీ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జాకోబ్ బెనర్జీ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అడక్కుండానే ప్రకృతి మనకు ఎన్నో అందిస్తోందని, ఎన్ని ఇచ్చినా మనిషి మాత్రం ప్రకృతి పట్ల చాలా క్రూరంగా వ్యవహరిస్తున్నాడన్నారు. ప్రకృతి వనరులను మానవుడు ధ్వంసం చేస్తున్నాడని, చెట్లను ఎలా పడితే అలా నరికివేస్తున్నారన్నారు. దీనివలన కాలుష్యం పెరిగిపోతోందని చెప్పారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, ప్రకృతి క్లబ్ ప్రతినిధులు డాక్టర్ షహీదా నీలోఫర్, డాక్టర్ భాగ్యలక్ష్మి, జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ బి. శివ హరిప్రసాద్, ఎన్‌సీసీ ఇన్‌చార్జి ఆర్. పవిత్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెల్వడం సొసైటీ అధ్యక్ష పదవికి తిరుపతిరావు రాజీనామా

వెల్వడం(మైలవరం): మైలవరం మండలం వెల్వడం సొసైటీ అధ్యక్ష పదవికి తోట తిరుపతిరావు బుధవారం రాజీనామా చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా సొసైటీ అధ్యక్షుడిగా తిరుపతిరావు బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ ఓడిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తిరుపతిరావు తెలిపారు.

క్యాన్సర్ శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం అందజేత



మధురానగర్(విజయవాడసెంట్రల్): క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారి కుటుంబానికి వైద్య ఖర్చులకు గానూ బుధవారం సాయి మణికంఠ కేటరర్స్ అధినేత జొన్నలగడ్డ రమేష్‌బాబు రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నగరానికి చెందిన సుబ్బు కుమార్తె చిన్నారి వేముల గీర్వాణి నిత్యశ్రీ క్యాన్సర్ చికిత్స పొందుతున్నారు. చిన్నారికి శస్త్ర చికిత్స సత్వరమే చేయాలని ఇందుకుగానూ రూ.35 లక్షలు ఖర్చవుతాయని వైద్యులు చెప్పారు. దీంతో రమేష్‌బాబు తన వంతు సాయంగా రూ.25 వేలు చిన్నారి తండ్రి సుబ్బుకు అందజేశారు.

నది ఒడ్డున వ్యర్థాల తొలగింపు



నది ఒడ్డున ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కృష్ణానది ఒడ్డున ప్రకాశం బ్యారేజీ సమీపంలోని కోవిడ్ పార్క్ వద్ద అమరావతి వాకర్స్ అండ్ రన్నర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి నది ఒడ్డున ఉన్న చెత్తచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక వికాసం నేపథ్యంలో అనేక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఆ క్రమంలో విలాస వస్తువుల నుంచి వచ్చే వివిధ వాయువులు లేదా ఇతర కాలుష్యాల నుంచి పర్యావరణానికి తీవ్రమైన ప్రమాదం వాటిల్లుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడంతో పాటు సాధ్యమైనంత వరకూ కాలుష్యాన్ని విడుదల చేసే వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రధానంగా నదీజలాలు కలుషితం కాకుండా అందరూ కృషి చేయాలన్నారు. తాగునీరు కలుషితం కావడం వలన ఇటీవల నగరంలో అనేక ఘటనలు చోటు చేసుకున్నాయని గుర్తు చేశారు. విద్యార్థులు వాటిపై ప్రజలను చైతన్యం చేసే దిశగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమాన్ని కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ టి.విజయభాస్కర్ నిర్వహించారు.

పర్యావరణపై చిత్రలేఖనం పోటీలు

తిరువూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పర్యావరణ దినోత్సవ సందర్భంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం, కాలుష్యం నియంత్రణకు తీసుకోవాలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటింటా మొక్కలు పెంచాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారవేయవద్దని, మట్టిలో కరగని ప్లాస్టిక్ వస్తువులను వినియోగించవద్దని గ్రంథాలయాధికారి పద్మావతి సూచించారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. జనరల్ నాలెడ్జిపై క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయిని భరతకుమారి, శాంతిరావు పాల్గొన్నారు.



తిరువూరు గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉపాధ్యాయులు, విద్యార్థుల అవగాహన ర్యాలీ



తిరువూరులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు



మల్లేలలో మొక్కకు నీళ్లు పోస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తిరువూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తిరువూరు బాలికల జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయులు బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ నానాటికీ వాతావరణ కాలుష్యం పెరిగిపోతుండటంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని, జీవితకాలం కూడా తగ్గిపోతోందని చెప్పారు. పచ్చదనం పెంపునకు పాటుపడాలని, ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటితే రానున్న ఐదు సంవత్సరాల్లో వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థినులతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. మండలంలోని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. మల్లేల, తిరువూరులలో అంగన్‌వాడీ కార్యకర్తలు మొక్కలు నాటారు.

చిన్నారి వైద్యానికి దీవెన ఫౌండేషన్ సాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయమై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారి నిశిక వైద్యం నిమిత్తం దీవెన ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. వన్‌టౌన్ కొత్తపేటకు చెందిన తండ్రి బాజీరావు చిన్నారి ఆపరేషన్‌కు సాయం చేయాలని దీవెన ఫౌండేషన్ సంస్థను ఆశ్రయించారు. స్పందించిన దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీసుల తరుఫున రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. టూ ట్రాఫిక్ సీఐ మహేంద్ర, గ్రూప్ సభ్యులు కానిస్టేబుల్ నాగేంద్రబాబు, బ్రహ్మం హాస్పిటల్‌కు వెళ్లి బాధితురాలి తండ్రి బాజీరావుకు నగదును అందించారు. ఈ సందర్భంగా చిన్నారి తండ్రి బాజీరావు మాట్లాడుతూ.. నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్న తమలాంటి పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. దీవెన ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ విజయవాడ సిటీ పోలీసులంతా కలిసి స్థాపించుకున్న దీవెన ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా విద్య, వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సాయం అందజేస్తున్నామని చెప్పారు. ఇందుకు సహాయ, సహకారాలు అందిస్తున్న సిటీ పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

విజ్ఞాన శిబిరానికి విశేష స్పందన

చాట్రాయి: చనుబండ, చాట్రాయి గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నారు. పలు రకాల విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను విద్యార్థులు చదువుతున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.